# ప్రజా మహత్వ

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 163 పేజిలు : 04 వెల రూ. 2 శుక్రవారం 12 - 12 - 2025




శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వస్తున్న రాష్ట్రపతి ముర్ము

## మంత్రి కొండా సురేఖపై నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ



- సురేఖపై నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ
- కొండా సురేఖ తనపై అభ్యంతకర వ్యాఖ్యలు చేశారంటూ కేటీఆర్ పరువు నష్టం కేసు
- కేసులో విచారణకు హాజరు కాని కొండా సురేఖ
- తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు
- వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మంత్రి సురేఖ తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. ఈ కేసు విచారణకు ఆమె హాజరు కాలేదు. దీంతో నాంపల్లి కోర్టు ఆమెపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.పిటిషన్‌పై విచారణ సందర్భంగా కొండా సురేఖ ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కాకపోవడంపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీలోపు కొండా సురేఖ నేరుగా కోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.

- మిగతా 2 లో

# మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఆహ్వానించా

- సీఎం రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్‌లో మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్
- కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించిన సీఎం
- హైదరాబాద్‌కు ఈ నెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజ క్రీడాకారుడు మెస్సీ
- రాష్ట్ర ప్రభుత్వానికి మెస్సీ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదన్న రేవంత్ రెడ్డి
- తనను కూడా ఒక అతిథిగా మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు పిలిచారని రేవంత్ రెడ్డి స్పష్టం
- రాష్ట్ర ప్రభుత్వానికి మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు



హైదరాబాద్‌లో జరగబోయే మెస్సీ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో పలు విషయాలపై మాట్లాడారు. ఈ నెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నారని, ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.తనను కూడా ఒక అతిథిగా మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు పిలిచారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. ప్రపంచంలోనే ప్రముఖ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నందున ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో కలిసిన పలువురు నాయకులను ఈ

- మిగతా 2 లో

## తెలంగాణ తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు




- జగిత్యాలలో తల్లిపై కూతురు విజయం
- తొలి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు ఎన్నికలు
- 776 మంది కాంగ్రెస్, 312 మంది బీఆర్ఎస్, 63 మంది బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు
- కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లెలో తల్లి గంగవ్వపై కూతురు సుమలత 91 ఓట్లతో విజయం

తెలంగాణ రాష్ట్రంలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. సాయంత్రానికి వెలువడిన ఫలితాల సరళిని పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తల్లి, కుమార్తె మధ్య పోటీ నెలకొంది.రిజర్వేషన్‌లో బీసీ మహిళకు కేటాయించడంతో

- మిగతా 2 లో

## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు



2 లో

సీఎం రేవంత్ రెడ్డి

- మెస్సీ హైదరాబాద్ పర్యటన ప్రైవేట్ కార్యక్రమం అని రేవంత్ వెల్లడి
- ఈవెంట్‌కు హాజరు కావాలని రాహుల్, ప్రియాంకలకు ఆహ్వానం
- ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్

## అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహ ప్రయోగం

- డిసెంబర్ 15న అమెరికా బ్లూబర్డ్-6 ఉపగ్రహ ప్రయోగం
- ఇస్రో అత్యంత శక్తిమంతమైన LVM3 రాకెట్‌తో ఈ ప్రయోగం
- బ్లూ బర్డ్-6 కమ్యూనికేషన్ శాటిలైట్ బరువు 6.5 టన్నులు
- భారత్-అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద అంతరిక్ష సహకారం




భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగాల్లో మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. అమెరికాకు చెందిన 6.5 టన్నుల బరువున్న 'బ్లూబర్డ్-6' కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని డిసెంబర్ 15న నింగిలోకి పంపనుంది. ఇస్రోకు చెందిన అత్యంత శక్తిమంతమైన లాంచ్ వెహికల్ మార్క్-3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్న అత్యంత బరువైన ఉపగ్రహాలలో ఇది ఒకటి.అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం కోసం అక్టోబర్

- మిగతా 2 లో

## ఐసీసీ టీ20 వరల్డ్ కప్ రూ.100 కే టికెట్




2 లో

- వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్డ్ కప్
- డిసెంబరు 11వ తేదీ సాయంత్రం 6.45 గంటలకు టికెట్ల అమ్మకాలు ప్రారంభం
- శ్రీలంకలో 1000 శ్రీలంకన్ రూపాయల నుంచి టికెట్ల ధరలు ప్రారంభం
- టికెట్ ధరలు భారీగా తగ్గించిన ఐసీసీ

## ప్రాజానానాడి




# 'ఇది మళ్లీ రిపీట్ కాకూడదు'

- మంత్రులపై సీఎం చంద్రబాబు సీరియస్
- కేబినెట్ భేటీకి పలువురు మంత్రులు ఆలస్యంగా రావటంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి
- సమయపాలన పాటించకపోతే ఎలా అంటూ ఆగ్రహం
- ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకూడదని సీఎం గట్టిగా చెప్పారు
- రాష్ట్రాన్ని ప్రమోట్ చేసే విధంగా వీలైనన్ని ఎక్కువ పర్యాటక ఈవెంట్లు నిర్వహించాలి
- స్థానిక సమస్యల పరిష్కార బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి తీసుకోవాలని సూచించారు
- ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావాల్సిందేనని సీఎం తేల్చి చెప్పారు



ఇవాళ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ భేటీలో పలువురు మంత్రులపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి మంత్రులు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకూడదని సీఎం గట్టిగా చెప్పారు. రేపల్లెలో గ్రామీణ రహదారులు నిర్మాణానికి చొరవ చూపినందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫ్లవర్ బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.మంత్రివర్గం అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో సీఎం చంద్రబాబు ఇతర అంశాలపై చర్చించారు. రుషికొండ ప్యాలెస్‌పై మంత్రివర్గ ఉపసంఘం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. సబ్

- మిగతా 2 లో



# ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు

- తాడేపల్లి వద్ద రూ.532 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం
- ప్రభుత్వ ఉద్యోగులకు రెండు విడతల కరవు భత్యం మంజూరు
- గిరిజన పాఠశాలల్లో 417 ఉపాధ్యాయ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు గ్రీన్ సిగ్నల్
- కుప్పం చెక్‌డ్యామ్ పనులకు సవరించిన అంచనాలకు ఆమోద ముద్ర
- కాలం చెల్లిన చట్టాల స్థానంలో కొత్త జైళ్ల చట్టం బిల్లుకు ఆమోదం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో రహదారుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, విద్యా రంగం, జైళ్ల సంస్కరణలకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా జాతీయ రహదారి 16పై భారీ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తాడేపల్లి వరకు 3.8 కిలోమీటర్ల పొడవున ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎల్1 బిడ్‌ను ఆమోదించారు. ఈ ప్రాజెక్టులో

- మిగతా 2 లో

# సంపాదకీయం

## ఇది సరికాదు

ప్రజాస్వామ్యంలో రాజకీయం పోటాపోటీగా ఉంటుంది. వాగ్యుద్ధాలకు అంతూపొంతూ ఉండదు. అధికార, విపక్షాల మధ్య ఘర్షణ చట్టసభల్లోనూ ఆరుబయటా నిత్యం సాగుతూంటుంది. ఆరోపణలూ ప్రత్యారోపణలు, నిందలూ నిష్టూరాలు, అవమానాలూ ఎత్తిపొడుపులూ అబ్బో చాలా ఉంటాయి. తనను ప్రభావితం చేయడానికి నాయకులు మా చెడ్డ ఇదైపోతున్నారని ఓటరుకు కూడా తెలుసు. అయితే, ఇదంతా రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కారు అన్న స్పృహతో, ప్రజాస్వామ్య స్ఫూర్తితో సరిహద్దుల్లోపల కొనసాగాల్సిన వ్యవహారం. దేశం ముందు తామూ, తమ పార్టీలు స్వల్పమైనవని, హద్దులు దాటిన ప్రవర్తనతో, చర్యలూ చేష్టలతో దేశం పరువు తీయకూడదని నాయకులు గుర్తుపెట్టుకోవాలి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, స్పీకర్, విపక్షనేత ఇత్యాదులంతా రాజ్యాంగ వ్యవస్థలో భాగమేనని, దాని ఆశయానికీ, స్ఫూర్తికీ భిన్నంగా వ్యవహరించకూడదని పాలకులకు తెలియదనుకోలేం. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన విందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనీ, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గేనూ ఆహ్వానించకుండా తగినశాస్తి చేశామని, అవమానించామని అధికారపక్షం కనుక భావించివుంటే, సరికాదు. పైపెచ్చు, అస్మదీయ శశిథరూర్‌ను పిలిచి, కాంగ్రెస్‌ను మానసికంగా మరింత దెబ్బతీశామని కూడా బీజేపీ నాయకులు అనుకున్నారేమో. విపక్షనేతను ఎందుకు పిలవలేదో, తనను ఎందుకు పిలిచారో తనకు తెలియదని అంటూనే ఈయన ఆ విందుకు హాజరవడం వేరే సంగతి. అందుకు ఆయనకు గల అర్హతల గురించి కూడా ఇక్కడ అప్రస్తుతం. విదేశీ అతిథులతో భేటీలకు విపక్షనేతలకు అవకాశం కల్పించే సంప్రదాయం నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చే ముందువరకూ అమలు జరిగిందని రాహుల్‌గాంధీ ఎంతో ముందుగానే ప్రభుత్వానికి గుర్తుచేశారు. ఆహ్వానం ఉండి కూడా ఇదే రాహుల్‌గాంధీ ఉపరాష్ట్రపతి, చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారాలకు ఎందుకు రాలేదని అధికారపార్టీ నాయకులు ఏవో ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు కానీ, ఒక దేశాధ్యక్షుడి గౌరవార్థం మన దేశాధ్యక్షులు ఇచ్చిన విందుకు విపక్షనేతలను ఆహ్వానించకపోవడం దుష్టసంప్రదాయం, తీవ్రమైన తప్పిదం. ఇది రాహుల్‌గాంధీకి సంబంధించిన అంశమో, ఆయనకు జరిగిన అవమానమో కాదు. ఈ చర్య ద్వారా ఒక రాజ్యాంగబద్ధపదవిని పాలకులు తేలికపరచారు, అగౌరవించారు. విపక్షనేత వెనుక ఒక పార్టీ ఉంది, ఆయన సారథ్యం వహిస్తున్న అనేక పార్టీల కూటమి ఉంది, వాటన్నింటి వెనుకా కోట్లాదిఓటర్లు ఉన్నారు. 2014 డిసెంబరులో పుతిన్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంలో సోనియాగాంధీతో భేటీకావడం ఆటుంచితే, దీనికిముందు పదేళ్ళ యూపీఏ పాలనలో అమెరికా, చైనా సహా వివిధ దేశాధినేతలు, దౌత్యప్రతినిధులతో అప్పటి విపక్షనేత 162సార్లు భేటీలు జరిపారని రికార్డులు చెబుతున్నాయి. విందు ఆహ్వానాలు లేకపోవడం సరే, కనీసం విదేశీ అతిథులతో మర్యాదపూర్వక భేటీలకు కూడా 2014 తరువాత విదేశాంగశాఖ విపక్షనేతలను అనుమతించడం మానేసింది. దీనిని సమర్థించుకోవడానికి ప్రభుత్వం దగ్గర చాలా కారణాలు ఉంటాయి కూడా. భారతరాష్ట్రపతి ఇచ్చిన విందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం రాహుల్‌గాంధీని ఉద్దేశపూర్వకంగా ఆహ్వానించలేదన్న విషయం వ్లాదిమిర్ పుతిన్‌కు తెలియకుండా పోదు. భారతదేశంతో సోవియట్ యూనియన్ ప్రాణస్నేహానికి, సర్వరంగాల్లో సహకారానికీ, రక్షణబంధానికీ బలమైన పునాదులు వేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల వారసుడిని తనకు కనిపించకుండా చేశారని పుతిన్ అనుకొని ఉండవచ్చు. గతంలో బీజేపీ మూలపురుషులు, పెద్దలు భారత్%-%సోవియట్ స్నేహాన్ని తప్పుబట్టి, అమెరికాకు సన్నిహితం కానందుకు కాంగ్రెస్‌ను విమర్శించినవారే. ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనూ భారత్ చేయివదలకుండా రష్యా ఇప్పటికీ తోడుగా అండగా ఉన్నదంటే అది కాంగ్రెస్ వేసిన పునాది బలం. అమెరికా తన నగ్న స్వరూపాన్ని ప్రదర్శించినప్పుడల్లా పరుగునపోయి రష్యా అధినేతను ఆలింగనం చేసుకుంటున్న ప్రస్తుత పాలకులకు ఈ చరిత్ర తెలియదనుకోలేం. మూడోపర్యాయం అధికారంలోకి వచ్చిన భారతీయ జనతాపార్టీ విదేశీ నేతల పర్యటనల సందర్భంలో కురుచగా వ్యవహరించాల్సిన అవసరం ఏమీ లేదు. వచ్చినవారితో భేటీకి ఇక్కడి పార్టీల పెద్దలకు దారులు తెరిచి ఉన్నతంగా, ఉదాత్తంగా ఉండవచ్చు. ఆపరేషన్ సిందూర్ మీద ప్రపంచదేశాలకు తమవాదన వినిపించడానికి విపక్షాన్ని ఎంచక్కావాడుకున్నవారు, అవసరం తీరాక ఇలా అవమానించడం సరికాదు.

## ‘ఇది మళ్లీ రిపీట్ కాకూడదు’

మొదటిపేజీ తరువాయి - కమిటీకు వచ్చిన ప్రతిపాదనలు బట్టి, ఎలా వినియోగించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని ప్రమోట్ చేసే విధంగా వీలైనన్ని ఎక్కువ పర్యాటక ఈవెంట్లు నిర్వహించాలని పర్యాటక, అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలు జరగాలని సూచించారు. రాష్ట్రానికి ఎక్కువ మంది పర్యాటకులు వచ్చేలా చూడాలి అని ఆదేశించారు. పీఎం కుసుమ్, సూర్యఘర్ వంటి పథకాల్లో కేంద్రం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుంటూ వీలైనంత ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. పగటి పూట విద్యుత్ వినియోగ భారం తగ్గించుకునేలా ఈ 2 పథకాలను ఎక్కువ ప్రోత్సహించాలని తెలిపారు. చేనేతలకు ఇస్తున్న విద్యుత్ రాయితీలలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పరిశ్రమలకు భూ కేటాయింపులు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జ్ మంత్రులు సమీక్షలు చేయకపోవడం సరికాదని మంత్రులతో సీఎం చంద్రబాబు అన్నారు. క్షేత్రస్థాయి సమస్యలపై ఇన్‌ఛార్జ్ మంత్రులు తన దృష్టికి తీసుకురావాలి కానీ, తానే మంత్రుల పనితీరు సమీక్షించే పరిస్థితి రాకూడదని హితవు పలికారు. పరిశ్రమల ఏర్పాటుతోపాటు స్థానిక సమస్యల పరిష్కార బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి తీసుకోవాలని సూచించారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావాల్సిందేనని సీఎం తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం ఇళ్లకు కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టని వాటిని సమీక్షించాలని స్పష్టం చేశారు. నిరుపయోగంగా ఉన్న కాలనీలపై తదుపరి నిర్ణయం తీసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పాత నిబంధనలు రద్దు చేసి మరింత మెరుగ్గా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## దూసుకుపోతున్న ధాన్యం కొనుగోళ్లు

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ (2025-26) సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. కేవలం ఒక్కరోజే, అంటే డిసెంబర్ 10న, ఏకంగా 1,46,607 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి పౌరసరఫరాల శాఖ ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. డిసెంబర్ 11 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 3,24,296 మంది రైతుల నుంచి మొత్తం 20,64,673 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు గాను రైతులకు ఇప్పటివరకు రూ.4,609.89 కోట్లను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమైన కేవలం 15 రోజుల్లోనే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 1,71,651 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్డ్ రైస్ బియ్యాన్ని పంపడం ఒక చారిత్రక రికార్డుగా పౌరసరఫరాల శాఖ పేర్కొంది. ఇటీవల కురిసిన వర్షాలు, దిత్వా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని 106 రైస్ మిల్లులకు ఇతర జిల్లాల నుంచి ధాన్యం తరలించేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేసింది. కొనుగోలు, రవాణా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 32,000 లారీలు, ట్రాక్టర్లు, ప్రత్యేక రైళ్లను వినియోగిస్తున్నారు. రైతులకు అండగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పారదర్శక విధానాలతో కొనుగోళ్లు జరుపుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మిల్లర్లపై కఠిన నిఘా ఉంచి, రోజువారీ సమీక్షలతో ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని, రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహ ప్రయోగం




మొదటిపేజీ తరువాయి - 19నే ఈ ఉపగ్రహం అమెరికా నుంచి భారత్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. ఇది కక్ష్యలో అతిపెద్ద కమర్షియల్ ఫేజ్డ్ అర్రేను కలిగి ఉంటుందని, గతంలో పంపిన బ్లూబర్డ్ ఉపగ్రహాల కన్నా 10 రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేస్తుందని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది. అంతరిక్ష రంగంలో భారత్, అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద సహకారం. గత జూలైలో ఇస్రో, నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన 1.5 బిలియన్ డాలర్ల నిసార్ ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. LVM3 రాకెట్ 8,000 కిలోల బరువును లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి, 4,000 కిలోల బరువును జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి మోసుకెళ్లగలదు. ఇటీవలే నవంబర్ 2న 4.4 టన్నుల బరువున్న సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారానే విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

# ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు

మొదటిపేజీ తరువాయి - ఇంటర్‌ఛేంజ్‌లు, వంతెనలు, అండర్‌పాస్‌లు కూడా భాగంగా ఉంటాయి. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువ రూ.532 కోట్ల 57 లక్షలుగా నిర్ణయించారు. దీనితో పాటు, చిత్తూరు జిల్లా కుప్పంలోని పలార్ నదిపై ఉన్న చెక్‌డ్యామ్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల కోసం సవరించిన పరిపాలనా ఆమోదాన్ని కేబినెట్ మంజూరు చేసింది. గతంలో రూ.10.24 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.15.96 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

### ఉద్యోగులు, విద్యారంగానికి ప్రాధాన్యం

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట కల్పిస్తూ రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 3.64 శాతం చొప్పున డీఏ చెల్లించనున్నారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని 417 పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో 227 తెలుగు, 91 హిందీ భాషా పండితుల పోస్టులతో పాటు 99 వ్యాయామ ఉపాధ్యాయుల (పీడీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్ల



కేడర్‌కు ఉన్నతీకరించారు.

### చట్టాలు, బోర్డులపై కీలక నిర్ణయాలు

బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేస్తూ జైళ్ల సంస్కరణల దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రూపొందించిన ‘మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023’కు అనుగుణంగా ‘ది ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్, 2025’ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును త్వరలో శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గంజాయి వంటి నేరాలకు పాల్పడిన ఖైదీలకు సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో సంస్కరణ తీసుకురావడంపై మరింత అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతోపాటు, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు పునర్వ్యవస్థీకరణకు కూడా కేబినెట్ ఆమోదించింది. ఈ బోర్డుకు చైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులను నియమించనున్నారు.

### విరూపాక్ష ఆర్గానిక్స్‌కు 100 ఎకరాల భూమి

పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహం అందించే క్రమంలో వైజాగ్%-%చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులకు కేబినెట్ పూర్తి ఆమోదం తెలిపింది. ప్రముఖ సంస్థ విరూపాక్ష ఆర్గానిక్స్‌కు 100 ఎకరాల భూమి కేటాయించాలని నిర్ణయించింది. అమరావతిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐదు కంపెనీల ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. రిలయన్స్ కన్స్యూమర్ యూనిట్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా తీర్మానించింది. రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గవర్నర్ బంగ్లా, దర్బార్ హాల్, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి సంబంధించిన బిడ్డింగ్ ప్రక్రియకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని రాజధాని నిర్మాణంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# ఐసీసీ టీ20 వరల్డ్ కప్... రూ.100 కే టికెట్

మొదటిపేజీ తరువాయి - క్రికెట్ అభిమానులకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుభవార్త చెప్పింది. 2026లో జరగనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌కు సంబంధించిన టికెట్ల అమ్మకాలను ఈరోజు ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. భారత కాలమానం ప్రకారం, ఈ రోజు (డిసెంబరు 11) సాయంత్రం 6:45 గంటల నుంచి https://tickets.cricketworldcup.com/ వెబ్‌సైట్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయి. భారత్‌లో కొన్ని వేదికల్లో టికెట్ ధరలు కేవలం రూ.100 నుంచి ప్రారంభం కానుండటం విశేషం. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఈ పదో ఎడిషన్ మెగా టోర్నీ, 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది. మొత్తం 20 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో 55 మ్యాచ్‌లు ఉంటాయి. అహ్మదాబాద్, చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్‌కతాతో పాటు శ్రీలంకలోని కొలంబో (రెండు వేదికలు), క్యాండీ నగరాలు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ మెగా ఈవెంట్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో టికెట్ ధరలను మునుపెన్నడూ లేని విధంగా అత్యంత తక్కువ ధరకే ఇస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. భారత్‌లో రూ.100, శ్రీలంకలో 1000 శ్రీలంకన్ రూపాయల నుంచి టికెట్ల ధరలు ప్రారంభం అవుతాయి. ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా మాట్లాడుతూ, “ప్రతి అభిమాని, వారి నేపథ్యం, ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రపంచ స్థాయి క్రికెట్‌ను స్టేడియంలో ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించాలన్నదే మా లక్ష్యం. ఈ టోర్నీ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకంగా నిలిచిపో తుంది” అని వివరించారు. ఈ విషయంపై బీసీసీఐ గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ, “టికెట్ ధరలు కేవలం రూ.100 నుంచి ప్రారంభం కావడం ఈ టోర్నీపై మరింత ఉత్సాహాన్ని పెంచుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు అత్యుత్తమ అనుభూతిని అందించేందుకు కట్టుబడి ఉన్నాం” అని తెలిపారు. శ్రీలంక క్రికెట్ సీఈఓ ఆష్లే డి సిల్వా స్పందిస్తూ,




“భారత్‌తో కలిసి ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉంది. అభిమానులందరూ ముందే టికెట్లు కొనుగోలు చేసి, ఈ క్రికెట్ సంబరంలో భాగం కావాలి” అని కోరారు.

# మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఆహ్వానించా

మొదటిపేజీ తరువాయి - కార్యక్రమానికి రావాలని పిలిచినట్లు చెప్పారు. ఏఐసీసీ అగ్రనేతలను సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సందర్భంలో ఈనెల 8, 9వ తేదీల్లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులు గురించి చర్చించినట్లు సమాచారం. ఇవే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సరళి, అనుసరిస్తున్న ప్రణాళికల గురించి మాట్లాడినట్లు సమాచారం. ఇంటర్నేషనల్ స్టార్లు రాబోతున్నారు : ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, సీఎం రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. మెస్సీ పర్యటన, ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై చర్యలు చేపట్టారు. ఈనెల 13వ తేదీ శనివారం రోజున సాయంత్రం 4 గంటలకు లియోనల్ మెస్సీ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మ్యాచ్‌కు హాజరవుతారు.



కేవలం ఉప్పల్ స్టేడియంలోనే రాచకొండ కమిషనరేట్‌కు సంబంధించిన పోలీసులు సుమారు 2వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రత ఏర్పాట్లలో పోలీసులకు అదనంగా స్టేడియం లోపల వెయ్యి మంది వాలంటీర్లు డ్యూటీలో ఉంటారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్, ఉప్పల్ స్టేడియం వరకు ప్రయాణించే మార్గాలు ఇప్పటికే ఫైనల్ అయ్యాయి. 13వ తేదీ రాత్రి కూడా ఫలక్‌నుమా ప్యాలెస్‌లోనే మెస్సీ బస చేస్తారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్యాలెస్ పరిసరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం ఫలక్‌నుమా ప్యాలెస్‌ను తాజ్ హోటల్స్ యాజమాన్యం నిర్వహిస్తోంది. ఫలక్‌నుమా ప్యాలెస్‌కు రాకపోకలు సాగించే మార్గాలు అక్రమంగా వచ్చేందుకు అవకాశమున్న ప్రాంతాలను పోలీసులను గుర్తిస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు టికెట్‌లు, పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు. పాస్‌లు లేనివారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించలేమని నిర్వాహకులు స్పష్టం చేశారు. స్టేడియం దగ్గర రద్దీకి అవకాశం లేకుండా అభిమానులు సహకరించాలని, అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

## తెలంగాణ తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు




మొదటిపేజీ తరువాయి - శివరాత్రి గంగవ్వను బీఆర్ఎస్ బలపరచగా, ఆమె కుమార్తె సుమలతను కాంగ్రెస్ బలపరిచింది. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపులో తల్లి గంగవ్వపై కుమార్తె సుమలత 91 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొదటి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగగా, ఏకగ్రీవాలతో కలుపుకుని 776 మందికి పైగా కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 312 మంది, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు 63 మంది, ఇతరులు బలపరిచిన 164 మంది అభ్యర్థులు విజయం సాధించారు. మొదటి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డులకు 65,455 మంది పోటీ పడ్డారు. యాదాద్రి జిల్లా లక్ష్మక్కపల్లిలో సర్పంచ్ అభ్యర్థులకు ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. లాటరీ తీయడంతో డ్రాలో బీఆర్ఎస్ మద్దతుదారు ఇండ్ల రాజయ్య విజయం సాధించారు.

## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు



మొదటిపేజీ తరువాయి - ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. దిల్లీలో కలిసిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు. ‘మెస్సీ గోట్ ఇండియా టూర్’లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆయన పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు కూడా రెండు జట్లుగా విడిపోయి ఆడనున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# అమరావతి క్వాంటమ్ వ్యాలీ సంచలనం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, భవిష్యత్ టెక్నాలజీ అయిన క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీలక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. దక్షిణాసియాలోనే మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఏర్పాటు చేయడంతో ఈ ప్రస్థానంలో ఒక చారిత్రక మైలురాయిని అధిగమించింది. ఇది కేవలం ప్రాంతీయ అభివృద్ధి మాత్రమే కాదని, దేశవ్యాప్త సాంకేతిక పరివర్తనకు నాంది అని, నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీలలో భారత్‌ను ఒక బలమైన శక్తిగా నిలబెడుతుందని ‘టైమ్స్ ఆఫ్ ఒమన్’ తన కథనంలో పేర్కొంది. ఈ బృహత్తర లక్ష్య సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తనదైన క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించింది. తద్వారా దేశంలోనే ఈ రంగంలో ముందంజ వేసిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఈ ప్రయాణంలో అమరావతి ఒంటరిగా ఏమీ వెళ్లడం లేదు. ప్రపంచ టెక్నాలజీ దిగ్గజాలైన ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి సంస్థలతో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యాల ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిశోధనా కేంద్రాల ఏర్పాటు వేగవంతం కానుంది. అంతేకాకుండా ఎన్విడియా, ఏడబ్ల్యూఎస్, వైజర్ వంటి గ్లోబల్ టెక్నాలజీ సంస్థలు కూడా పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధి, ఎకోసిస్టమ్ ఇంటిగ్రేషన్ కోసం అమరావతితో చేతులు కలిపాయి. ఈ అంతర్జాతీయ సహకారంతో అమరావతి ప్రపంచ క్వాంటం ఆవిష్కరణల నెట్‌వర్క్‌లో ఒక ముఖ్యమైన భాగంగా ఎదుగుతోంది. కేవలం మౌలిక సదుపాయాల కల్పనే కాకుండా, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపైనా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ లక్ష్యంతోనే ‘అమరావతి క్వాంటమ్ అకాడమీ’ని ఏర్పాటు చేశారు. రాబోయే దశాబ్దంలో ఈ అకాడమీ ద్వారా 50,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, కనీసం 100 మంది అత్యుత్తమ క్వాంటం పరిశోధకులను, స్టార్టప్‌లను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా వేల సంఖ్యలో అత్యున్నత స్థాయి ఉద్యోగాలను సృష్టించాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ అనేది కేవలం ఒక పరిశోధనా కేంద్రం మాత్రమే కాదు. హార్డ్‌వేర్ తయారీ, సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిని ఒకేచోట మేళవించిన ఒక సమీకృత ఎకోసిస్టమ్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఆరోగ్య సంరక్షణ, సైబర్ సెక్యూరిటీ నుంచి మొదలుకొని వాతావరణ మార్పుల నమూనాలు, అంతరిక్ష పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు అనేక రంగాలలో క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, 2030 నాటికి బోస్టన్, మ్యూనిచ్, సింగపూర్, టోక్యో వంటి ప్రపంచంలోని టాప్ 5 క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలపాలనే మహోన్నత లక్ష్యంతో ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి.

# నేను ప్రస్తుతం బీఆర్ఎస్‌లో లేను. అయినా ప్రజల కోసం పోరాటం ఆగదు" : కల్వకుంట్ల కవిత

**మలక్‌పేట్ -యాకుత్‌పురా "జనం బాట" పర్యటనలో**

**కల్వకుంట్ల కవిత: విద్యార్థులు, వ్యాపారులు,**

**వృత్తిదారుల సమస్యలపై ప్రభుత్వంపై మండిపాటు**






**హైదరాబాద్ డిసెంబర్ 11 (ప్రజా మంటలు) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మలక్‌పేట్, సైదాబాద్, యాకుత్‌పురా ప్రాంతాల్లో పర్యటిస్తూ విద్యార్థులు, వ్యాపారులు, కుమ్మరి వృత్తిదారులు, స్థానిక ప్రజల సమస్యలను సమీక్షించారు.నేను ప్రస్తుతం బీఆర్ఎస్‌లో లేను. అయినా ప్రజల కోసం పోరాటం ఆగదు" అని కవిత స్పష్టం చేశారు.మూసారాంబాగ్‌లో విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న కవిత, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, సర్టిఫికెట్ జాప్యం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రెండు సంవత్సరాలుగా పాస్ అయిన విద్యార్థులకూ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వలన ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని అన్నారు.మలక్‌పేట్ గంజ్‌ను సందర్శించిన కవిత, హమాలీలు%-%వ్యాపారులతో మాట్లాడి, మార్కెట్ సదుపాయాలు, శానిటేషన్, రోడ్లు, విద్యుత్, %+నవీజ% నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కోహెడ మార్కెట్ వచ్చినా, మలక్‌పేట్ మార్కెట్ కొనసాగుతుందన్నారు.

**సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్ పనులు అసంపూర్ణం**

2020లో ప్రారంభమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్ పనులు ఐదేళ్లుగా పూర్తి కాకపోవడంపై తీవ్రంగా ఆగ్రహించిన కవిత, నిర్మాణ ఆలస్యాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని ఆరోపించారు. యాకుత్‌పురాలో కుమ్మరి వృత్తిదారుల సమస్యలను తెలుసుకున్న ఆమె, మట్టి కొరత, అధిక రవాణా ఖర్చులు వృత్తిని దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ కుమ్మరి చక్రాలపై సబ్సిడీలు, బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పాత నగరంలో డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారం కానట్లే ఉన్నాయని కవిత విమర్శించారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు.

# జగిత్యాల జిల్లా - గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ మొత్తం 73.68 శాతం

**జిల్లాలో మండలాల వారి పోలింగ్**

| లవ | మండలం | మొత్తం ఓటర్లు | ఓటు వేసవారు | పోలంగ్ శాతం |
|---|---|---|---|---|
| 1 | భీమారం | 17,577 | 13,406 | 76.27 |
| 2 | ఇబ్రహింపట్నం | 30,465 | 19,164 | 62.90 |
| 3 | కథలాపూర్ | 37,573 | 27,907 | 74.39 |
| 4 | కోరుట్ల | 31,243 | 23,364 | 74.78 |
| 5 | మల్లాపూర్ | 41,103 | 30,282 | 73.67 |
| 6 | వేడపల్లి | 24,251 | 18,777 | 77.43 |
| 7 | మెటపలి | 36,039 | 27,861 | 77.31 |
| | మొత్తం | 2,18,194 | 1,60,761 | 73.68 |

**జగిత్యాల డిసెంబర్ 11 (ప్రజా మంటలు) :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లాలో పోలింగ్ మధ్యాహ్నం 1 గంటకు ముగిసింది. అధికారిక లెక్కల ప్రకారం, జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,18,194 మంది నమోదైన ఓటర్లలో 1,60,761 మంది తమ ఓటు హక్కును వినియోగించారు. దీంతో జిల్లాలో మొత్తం పోలింగ్ శాతం 73.68%.

మండలాల వారీ మొదటిదశ పోలింగ్ వివరాలు

**జిల్లాలోని ఏడు మండలాల్లో పోలింగ్ ఇలా నమోదైంది:**

1. భీమారం
మొత్తం ఓటర్లు: 17,577
పోలింగ్ చేసిన వారు: 13,406
పోలింగ్ శాతం: 76.27%
**భీమారం మండలం ఓటింగ్‌లో మంచి స్పందన చూపింది.**

2. ఇబ్రహింపట్నం
మొత్తం: 30,465
పోలింగ్: 19,164
శాతం: 62.90%
**జిల్లాలో అత్యల్ప పోలింగ్ నమోదైన మండలం ఇదే.**

3. కథలాపూర్
మొత్తం: 37,573
పోలింగ్: 27,907
శాతం: 74.39%

4. కోరుట్ల
మొత్తం: 31,243
పోలింగ్: 23,364
శాతం: 74.78%

5. మల్లాపూర్
మొత్తం: 41,103
పోలింగ్: 30,282
శాతం: 73.67%

6. మేడిపల్లి
మొత్తం: 24,251
పోలింగ్: 18,777
శాతం: 77.43%
జిల్లాలో అత్యధిక పోలింగ్ నమోదైన మండలం ఇదే.

7. మెటుపల్లి
మొత్తం: 36,039
పోలింగ్: 27,861
శాతం: 77.31%

పోలింగ్ పై సమగ్ర విశ్లేషణ

జిల్లా మొత్తం పోలింగ్ శాతం 73.68% వద్ద ముగియడం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి మంచి సూచకంగా నిలిచింది.

మేడిపల్లి (77.43%), మెటుపల్లి (77.31%), భీమారం (76.27%) మండలాలు అత్యధిక హాజరు నమోదు చేశాయి.

మరోవైపు ఇబ్రాహింపట్నం మండలంలో కేవలం 62.90% మాత్రమే పోలింగ్ జరగడం గణనీయంగా తక్కువగా నమోదైంది.

పురుషులు, మహిళలు కలిపి నమోదైన ఓటర్లలో మంచి హాజరు కనిపించడం ఈ ఎన్నికల్లో ప్రజల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తోంది.

# ప్రశాంత వాతావరణంలో మెదటి విడత పోలింగ్ నిర్వహణ పూర్తి

## జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**కోరుట్ల /మెట్పల్లి /మేడిపల్లి డిసెంబర్ 11 ( ప్రజా మంటలు) :** మొదటి విడత 7 మండలాల్లోని గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. మేడిపల్లి మండల కేంద్రంలోని కొండాపూర్ గ్రామం, భీమారం మండల కేంద్రంలోని కమ్మరిపేట, కోరుట్ల మండలంలోని సంగెం, నాగులపేట్, ఐలాపూర్ గ్రామాలు, మెట్ పెల్లి మండలంలోని వెల్లుల్ల, జగ్గసాగర్ గ్రామాలు, ఇబ్రహీంపట్నం మరియు మల్లాపూర్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మెట్ పెల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ జిల్లా సాధారణ పరిశీలకులు జి. రమేష్ తో కలిసి పోలింగ్ జరుగుతున్న కేంద్రాలను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు.పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఒకటి తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం లోపలికి అనుమతించకూడదని ఎన్నికల అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి, డిపివో రఘువరన్, జిల్లా నోడల్ అధికారులు, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, ఎమ్మార్వో లు, ఎంపిడివోలు మరియు తదితరులు ఉన్నారు.

# భీమదేవరపల్లి మండలం గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రకటన






**భీమదేవరపల్లి, డిసెంబర్ 11 (ప్రజామంటలు) :** భీమదేవరపల్లి మండలం పరిధిలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు గురువారం అధికారికంగా వెలువడ్డాయి. మండలంలోని 25 గ్రామపంచాయతీలకు సర్పంచ్ పదవులు ఎవరి ఖాతాలోనికి వెళ్లాయో స్పష్టమైంది. కొన్ని చోట్ల గట్టి పోటీ జరిగి కొద్ది తేడాతో విజయాలు నమోదయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో ఏకగ్రీవాలు చోటుచేసుకోవడం ప్రత్యేకత. ఈ ఎన్నికల్లో యువ నాయకులు, మహిళలు, అనుభవం కలిగిన వ్యక్తులు ఎక్కువ సంఖ్యలో విజయం సాధించారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ వనరుల బలోపేతంపై తమదైన ప్రణాళికలతో పని చేస్తామని సర్పంచ్‌లు హామీ ఇస్తున్నారు. మండలవ్యాప్తంగా ఎన్నికలు శాంతియుతంగా జరిగాయి.

**భీమదేవరపల్లి మండలంలోని సర్పంచ్‌లు వీరే**

ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ముత్తారం - ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఎర్రబెల్లి - కాలేరు శ్రావణ్ కుమార్, గొల్లపల్లి నేతుల - చంద్రమోహన్, ముస్తఫాపూర్ - గడ్డం సుజాత రఘుపతి రెడ్డి, వీరభద్రనగర్ - కొర్ర గోపాల్, గట్ల నర్సింగాపూర్ - (వివరాలు రాలేదు), బొల్లోనిపల్లి - బొల్లి మానస ప్రశాంత్, రాంనగర్ - డప్పు శ్రీనివాస్, కొత్తకొండ - సిద్దమల్ల రమ రమేష్, చంటయ్యపల్లి - భూక్య సునీత, రసూల్‌పల్లి - బోయిని మహేష్, మల్లారం - తిరుపతి రెడ్డి, ధర్మారం - గోపగాని తిరుపతి, కొత్తపల్లి - సిక ప్రదీప్, సాయినగర్ - మేకల వెంకన్న, భీమదేవరపల్లి - మాచర్ల కుమారస్వామి, రత్నగిరి - తిరుమల సురేష్ గౌడ్, విశ్వనాధ కాలనీ - వల్లెపు సుధాకర్, కొప్పూర్ - గద్ద కుమారస్వామి, గాంధీనగర్ - కేతిరి లక్ష్మారెడ్డి (ఏకగ్రీవం), మాణిక్యపూర్ - ముద్దవేన మమత, వంగర - గజ్జల సృజన రమేష్, రంగయ్యపల్లి - మండల రజిని, వీర్లగడ్డ తండా - గుగులోత్ పూర్ణిమ నాయక్ లంబాడి తండాలో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం.

**ఎన్నికల అనంతరం ఆనందోత్సవాలు**

విజయం సాధించిన అభ్యర్థుల ఇళ్ల వద్ద కార్యకర్తలు, గ్రామస్తులు భారీ పటాకులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కొన్నిచోట్ల విజేతలకు పూలదండలు, శాలువాలు కప్పి ఘన సన్మానాలు నిర్వహించారు. గ్రామాల్లో డప్పులు, డ్యాన్సులు, మోటార్ బైక్ ర్యాలీలతో సందడి నెలకొంది.

**అభివృద్ధే లక్ష్యం: కొత్త సర్పంచ్‌లు**

తమ గ్రామాల అభివృద్ధిని కాంక్షిస్తూ తాగునీరు, రహదారులు, వీధి లైట్లు, డ్రెయినేజ్, వ్యవసాయ నీరు వంటి అంశాలను ప్రాముఖ్యతనిస్తామని విజేత సర్పంచ్‌లు తెలిపారు. గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ అమలుకి 9వ షెడ్యూల్లో చేర్చాలి: జీవన్ రెడ్డి



**జగిత్యాల (రూరల్), డిసెంబర్ 11 (ప్రజా మంటలు) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటే, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం తప్పనిసరి అని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల ఇందిరా భవన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, 50% రిజర్వేషన్ పరిమితిని అధిగమించడానికి ఇదే మార్గమని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ఆలోచనలతో బలహీన వర్గాలకు 42% రిజర్వేషన్ ప్రతిపాదన వచ్చిందని, ఇది స్థానిక సంస్థలకే కాదువిద్యా, ఉద్యోగాల్లో కూడా అమలు కావాలన్నారు. బీసీ నాయకుడు ఆర్. కృష్ణయ్య పోరాటం అభినందనీయం అని ఆయన ప్రశంసించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు లేకపోవడంతో కేంద్ర నిధులు కోల్పోతున్నామని కూడా జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, బండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై యమధర్మరాజు అవగాహన



**సికింద్రాబాద్, డిసెంబర్ 11 ( ప్రజామంటలు) :** హైదరాబాద్ సిటీ కమిషనర్ వి.సీ. సజ్జనార్ పర్యవేక్షణలో, ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో బేగంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సిగ్నల్, బోయిన్‌పల్లి జంక్షన్ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని బేగంపేట్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. నర్వేజనా ఫౌండేషన్,కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రుల సీఈఓ డా. గురవా రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంగా ఈ అవగాహన చేపట్టింది.ట్రాఫిక్-ఏసీపీ జి. శంకర్ రాజు, ఇన్‌స్పెక్టర్ జి. జానకిరాములు, ఎస్ఐలు శివరాజు, అశోక్ రెడ్డి తదితరులు, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ అధికారులతో కలిసి మోటారిస్ట్ లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యమధర్మరాజు వేషధారణలో కళాకారుడితో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, స్టాప్‌లైన్ పాటించడం, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించిన వారికి ఫైవ్‌స్టార్ చాక్లెట్లు, రోజ్ ఫ్లవర్స్ లను అందజేసారు.రాంగ్ పార్కింగ్, సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్,సీటుబెల్ట్ లేకుండా డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు.

# సీఎం సహాయనిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల రూరల్ డిసెంబర్ 11(ప్రజా మంటలు) :** రూరల్ మండలం అంతర్గం గ్రామానికి చెందిన ఏ.సుగుణ కు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 1లక్ష 20 వేల రూపాయల విలువగల చెక్కులను జగిత్యాల క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ వెంట నాయకులు నక్కల రవీందర్ రెడ్డి రౌతు గంగాధర్ తదితరులు ఉన్నారు.

# కొత్తగూడెం జాగృతి ఇన్‌చార్జ్‌గా జగదీశ్



**హైదరాబాద్ డిసెంబర్ 11 (ప్రజా మంటలు) :** తెలంగాణ జాగృతి కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నమ్మి జగదీశ్‌ను నియమిస్తూ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి అధికారిక ప్రకటనలో వెల్లడించారు. అదే విధంగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సముద్రాల క్రాంతి కుమార్‌ను తెలంగాణ జాగృతి ఐటీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించారు.కొత్త బాధ్యతలు స్వీకరించిన నాయకులకు జాగృతి నాయకత్వం శుభాకాంక్షలు తెలియజేసింది.

# ముత్తారం సర్పంచ్ గా ఉరడి భారతి జైపాల్ రెడ్డి విజయం

**ఆనందోత్సవాల్లో గ్రామ ప్రజలు**

**గట్టి పోటీ ఇచ్చిన కొర్ర స్వర్ణలత శ్రీకాంత్**

**ఉప సర్పంచ్ గా మాట్ల హరికుమార్**




**భీమదేవరపల్లి, డిసెంబర్ 11 (ప్రజామంటలు) :** ముత్తారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఉరడి భారతి జైపాల్ రెడ్డి స్పష్టమైన మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించిన వెంటనే గ్రామంలో సందడి నెలకొంది. మహిళా సర్పంచ్ గెలుపుతో గ్రామ ప్రజలు భారీగా ఊరేగింపుకు సన్నాహాలు చేస్తూ పటాకులు పేల్చారు. విజేత భారతి తమ విజయం గ్రామ ప్రజల ఆశీర్వాదం, అభిమానం అని పేర్కొన్నారు. ఇతర అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తూ చివరి వరకు పోరాడిన కొర్ర స్వర్ణలత శ్రీకాంత్ మంచి ఓట్లను సాధించారు. గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ కృషి కొనసాగుతుందన్నారు. అదేవిధంగా ఉపసర్పంచ్ పదవికి మాట్ల హరికుమార్ ఎన్నికయ్యారు. గ్రామ భవిష్యత్తు అభివృద్ధే తన లక్ష్యం అని హరికుమార్ పేర్కొన్నారు. గ్రామంలో ప్రాథమిక సదుపాయాల విస్తరణ, తాగునీటి సమస్యల పరిష్కారం, రోడ్ల మరమ్మతులు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై త్వరలోనే కార్యాచరణ చేపడతామని నేతలు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా జరుగడానికి సహకరించిన గ్రామస్తులకు, పోలీసు శాఖకు, అధికార యంత్రాంగానికి సర్పంచ్ భారతి, ఉపసర్పంచ్ హరికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవ ర్యాలీలు నిషేధం

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల డిసెంబర్ 11 (ప్రజా మంటలు) :** గ్రామాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు జిల్లాలో జరుగుతున్న తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తెలిపారు. ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఓట్ల లెక్కింపు పక్రియ సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎక్కువ మందిని ఉండకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎం సి సి) అమలులో ఉందని మొదటి విడత ఎన్నికల ఫలితాలు ప్రకటించినప్పటికీ, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు ఇప్పుడే విజయోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు, డీజే లు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎం సి సి అమల్లో ఉన్నందున ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని నియమాలను అతిక్రమించే ఏ చర్యనైనా సహించేది లేదని. ఉల్లంఘనలు జరిగితే వెంటనే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని,ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

# హబ్సిపూర్‌లో బీజేపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి




**జగిత్యాల రూరల్, డిసెంబర్ 11 (ప్రజా మంటలు) :** గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హబ్సిపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి పూదరి వెన్నెల%-%గోపి గెలుపు కోసం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి ఇంటింటి పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం ు ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా పార్టీ కృషి చేస్తోందని చెప్పారు. గ్రామ అభివృద్ధి కోసం బీజేపీ శాసన, కేంద్ర బలాన్ని ఉపయోగించుకునేందుకు పూదరి వెన్నెల%-%గోపి ని గెలిపించాలని గ్రామస్తులను కోరారు.కార్యక్రమంలో జగిత్యాల మండల అధ్యక్షులు ఇట్నేని రమేష్, ఏలేటి రమణ రెడ్డి, గుడికందుల లచ్చన్న, కళ్లెం బాలకృష్ణారెడ్డి, ఎనగందుల ఉమాపతి, అంకతి సత్యనారాయణ, కణపటి వంశీకృష్ణ, ధర్మేందర్ చారి, కంది అంజిరెడ్డి, తల్లా శ్రీనివాస్, శివకాంత్ మరియు గ్రామ యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా మంటలు

శుక్రవారం 12 - 12 - 2025

# ముల్కనూర్ గ్రామ స్వరాజ్యానికి 73 ఏళ్ల సాక్ష్యం సర్పంచుల వారసత్వం

ముల్కనూర్ గ్రామాన్ని ముందుకు నడిపిన నాయకుల దారిలో.....

ప్రస్తుత సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి

ముల్కనూర్ సర్పంచుల చరిత్రపై ప్రజామంటలు ప్రత్యేక కథనం

(కాశిరెడ్డి ఆదిరెడ్డి రిపోర్టర్)






**భీమదేవరపల్లి డిసెంబర్ 11 (ప్రజామంటలు) :** గ్రామ స్వరాజ్యాన్ని ప్రతిబింబించే పంచాయతీ పాలనలో ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఎనిమిది దశాబ్దాల ప్రయాణం విశేషమైనది. 1952లో తొలి సర్పంచ్ పదవి ఏర్పడినప్పటి నుంచి 2025 వరకు గ్రామ అభివృద్ధికి సేవలందించిన సర్పంచుల జాబితా గ్రామ ప్రజల పట్ల అంకితభావాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. కాలం మారినా, నాయకులు మారినా ప్రజా సేవ ధ్యేయంగా మార్గదర్శకులుగా నిలిచిన గ్రామ సర్పంచుల సేవలు ముల్కనూరుకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచుల క్రమపట్టిక (1952%-%2025) వరకు పరిశీలిస్తే అలిగిరెడ్డి సంజీవరెడ్డి (1952%-%1955) (ముల్కనూరు తొలి సర్పంచ్), అలిగిరెడ్డి సంజీవరెడ్డి %- (1955-%1964), అలిగిరెడ్డి రాజిరెడ్డి (1964%-%1970), బొజ్జపురి వెంకటయ్య (1970%-%1981), అలిగిరెడ్డి రాజిరెడ్డి (1981%-%1989 రెండోసారి), అలిగిరెడ్డి దేవేందర్ (1995%-%2001), వంగ అరుణ (2001%-%2006), పడాల గౌతం (2006%-%2011), వంగ రవి (2013%-%2018), మాడుగుల ప్రెస్ కొమురయ్య (2019%-%2024), జాలి ప్రమోద్ రెడ్డి ప్రస్తుతం 2025.

**గ్రామ అభివృద్ధిలో కీలక మైలురాళ్లు**

ముల్కనూరులో త్రాగునీరు, విద్య, రోడ్ల నిర్మాణం, గ్రామఅభివృద్ధి ప్రతి దశలోనూ సంబంధిత సర్పంచుల నాయకత్వం స్పష్టంగా కనిపించిందని గ్రామ పెద్దలు గుర్తుచేసుకుంటున్నారు.

**1952 నుంచి 2025 వరకు నాయకత్వం**

ప్రథమ సర్పంచ్ అలిగిరెడ్డి సంజీవరెడ్డి గ్రామ పాలనకు పునాది వేయగా, తరువాత వచ్చిన నాయకులు పల్లె అభివృద్ధిని తమ ధ్యేయంగా ముందుకు నడిపారు. విద్యుత్, రవాణా సదుపాయాలు, తాగునీటి వనరులు, స్వచ్ఛ గ్రామ చర్యలు అన్నింటిలోనూ పంచాయతీ కీలక పాత్ర పోషించింది.

**ప్రస్తుత సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి బాధ్యతలు**

2025 లో బాధ్యతలు స్వీకరించిన జాలి ప్రమోద్ రెడ్డి గ్రామ అభివృద్ధిని వేగవంతం చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. వినూత్న సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, యువత, మహిళల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలియజేశారు. గ్రామ స్వరాజ్యాన్ని ప్రతిబింబించే ఈ సుదీర్ఘ నాయకత్వ లక్షణాలు ముల్కనూర్ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని గ్రామ ప్రజలు గర్వంగా భావిస్తున్నారు.

# జంట హత్యల కేసు.. మాచర్ల కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి సోదరులు

గుండ్లపాడు జంట హత్యల కేసులో నిందితులుగా ఉన్న అన్నదమ్ములు

నేటితో ముగిసిన సుప్రీంకోర్టు విధించిన రెండు వారాల గడువు

ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం



మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి గురువారం ఉదయం మాచర్ల కోర్టులో లొంగిపోయారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు నేటితో ముగియడంతో వారు న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. ఈ ఏడాది మే 24న గుండ్లపాడు గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు అనే అన్నదమ్ములను దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. తెలంగాణలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా వారి బైక్‌ను కారుతో ఢీకొట్టి, కిందపడ్డాక బండరాళ్లతో కొట్టి చంపారు. ఈ ఘటనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో మొత్తం 9 మందిని నిందితులుగా చేర్చగా, పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఏ6గా, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిని ఏ7గా పేర్కొన్నారు. ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు పిన్నెల్లి సోదరులు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నిందితులు సాక్షులను బెదిరిస్తున్నారని, విచారణకు సహకరించడం లేదని కోర్టుకు తెలిపారు. దీంతో వారి ముందస్తు బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే, లొంగిపోయేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని వారి తరపు న్యాయవాది కోరడంతో సర్వోన్నత న్యాయస్థానం గడువు మంజూరు చేసింది. ఈ గడువు ఇవాళ్టితో ముగియడంతో పిన్నెల్లి సోదరులు మాచర్ల జూనియర్ సివిల్ కోర్టులో లొంగిపోయారు.

# దేశానికి అనేక ఆణిముత్యాలను అందించిన విద్యాసంస్థ ఇది

సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ 175వ వార్షికోత్సవం

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**సికింద్రాబాద్, డిసెంబర్ 11 (ప్రజామంటలు) :** దేశానికి అనేక ఆణిముత్యాలను అందించిన విద్యాసంస్థగా సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ నిలిచిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రెజిమెంటల్ బజార్‌లో జరిగిన సెయింట్ ఫ్రాన్సిస్ బాలికల హైస్కూల్ 175వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలికల విద్యకు 175 ఏళ్లుగా సేవ చేస్తూ ఎందరో ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు, సమాజ సేవకులను ఈ పాఠశాల అందించిందన్నారు. 30 మందితో ప్రారంభమైన స్కూల్ ప్రస్తుతం 2,500 మంది విద్యార్థినులు, 112 మంది ఉపాధ్యాయులతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ద్వేషాన్ని ప్రేమతోనే జయించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాజీ ఐఏఎస్ అనిత రామచంద్రన్, పాఠశాల సుపీరియర్ డా. ఆల్ఫోన్సా, ప్రధానోపాధ్యాయురాలు గ్రేసీ మెండోన్స్ తదితరులు పాల్గొన్నారు.



# గాడిన పడుతున్న ఇండిగో సేవలు.. నేడు 1950 విమానాలు

సాధారణ స్థితికి చేరుకుంటున్న ఇండిగో కార్యకలాపాలు

నేడు 1950 విమాన సర్వీసులు నడపడమే లక్ష్యమని ప్రకటన

ఇండిగోపై నిఘా పెట్టిన డీజీసీఏ ప్రత్యేక బృందం



గతవారం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్న ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో నెమ్మదిగా సాధారణ స్థితికి చేరుకుంటోంది. కార్యకలాపాలను పునరుద్ధరిస్తున్నామని, ఈరోజు 1,950కి పైగా విమానాలను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించింది. ఈ సర్వీసుల ద్వారా సుమారు 3 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనున్నట్లు తెలిపింది. గత కొన్ని రోజులుగా కార్యకలాపాలు మెరుగుపడ్డాయని, ఈ నెల 9 నుంచి సేవలు స్థిరంగా కొనసాగుతున్నాయని కంపెనీ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులుగా విమానాల షెడ్యూల్ విశ్వసనీయంగా ఉందని, కేవలం వాతావరణం, సాంకేతిక కారణాల వల్లే కొన్ని సర్వీసులు రద్దయ్యాయని వివరించారు. సమయపాలనలో మళ్లీ మెరుగైన ప్రమాణాలను అందుకున్నామని పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు వేలాది విమానాలు రద్దు కావడం, ఆలస్యం అవడంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ అంతరాయాల వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా క్షమాపణ చెప్పారు. ఈ వైఫల్యానికి గల మూల కారణాలను గుర్తించేందుకు బయటి సాంకేతిక నిపుణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే... ఇండిగో కార్యకలాపాలను నిశితంగా పరిశీలించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) 8 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలోని ఇద్దరు అధికారులు ఇండిగో కార్పొరేట్ కార్యాలయంలో ఉండి రోజువారీ ప్రక్రియలను పర్యవేక్షిస్తారు.

# అనంత జిల్లా వాసులకు గుడ్‌న్యూస్

రయ్ రయ్‌మంటూ దూసుకెళ్లనున్న ఈ-బస్సులు

ఇంధన కొరతకు చెక్

ఛార్జింగ్ స్టేషన్ల కోసం స్థలం వేట

కాలం చెల్లిన డీజిల్ బస్సులకు ఇక సెలవు




ఇంధన ధరల మోత, కాలుష్య కోరల నుంచి బయటపడేందుకు ఆర్టీసీ సరికొత్త అడుగు వేసింది. అనంతపురం జిల్లా ప్రజా రవాణా వ్యవస్థలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇకపై పర్యావరణ హితమైన 'ఈ-బస్సులు' జిల్లా రహదారులపై రయ్ రయ్ మంటూ దూసుకెళ్లనున్నాయి. డీజిల్ పొగలు లేకుండా, ఇంజిన్ల చప్పుళ్లు వినిపించకుండా ఆ బస్సులు తిరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేస్తుండగా, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాతిపదికన అనంతపురం డిపోకు మొదటి ప్రాధాన్యత దక్కింది. త్వరలోనే 50 ఈ-బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి జిల్లా మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని, వ్యూహాత్మకంగా అనంతపురం డిపోను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. మొత్తం ఈ-బస్సులు 50. ప్రస్తుతమున్న బస్సులు 104. భవిష్యత్తులో దశలవారీగా ఇతర డిపోలకు కూడా ఈ సేవలను విస్తరించనున్నారు. ఛార్జింగ్ స్టేషన్ల కోసం తర్జనభర్జన: బస్సులు వస్తున్నాయన్న ఆనందం ఉన్నా, వాటి నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నిబంధనల ప్రకారం ఈ-బస్సులు నిలిపి ఉంచడానికి కనీసం ఒక ఎకరా స్థలం అవసరం. అనంతపురం డిపోలో స్థలం ఉన్నప్పటికీ, ఇప్పటికే అక్కడ బస్ షెడ్లు ఉన్నాయి. డిపోలోని ప్రహరీ గోడ చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నా, స్థలం సరిపోతుందా లేదా అన్న సందేహం ఉంది. రీజినల్ మేనేజర్ (ఆర్ఎమ్) కార్యాలయం సమీపంలో ఖాళీ స్థలం ఉన్నా, అక్కడ బస్సులకు తగినంత భద్రత ఉండదని అధికారులు ఆలోచిస్తున్నారు. అనంతపురం డిపో కేంద్రంగా ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలకు ఈ-బస్సులను నడిపేందుకు రూట్ మ్యాప్ సిద్ధమైంది. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం. శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం. ఈ ప్రధాన మార్గాల్లో ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. ఈ-బస్సుల రాకతో పాత బస్సులకు కాలం చెల్లింది. 15 ఏళ్లు నిండిన ఆర్టీసీ బస్సులను స్క్రాప్ (తుక్కు) కింద పంపనున్నారు. అనంతపురం డిపోలో ఇప్పటికే నాలుగు బస్సులను తుక్కుకు పంపారు. ఏప్రిల్, మే నెలల్లో మరో 3 బస్సులకు 15 ఏళ్లు నిండుతాయి. ఈలోగా కొత్త ఈ-బస్సులు వస్తాయి కాబట్టి రవాణాకు ఇబ్బంది ఉండదు. అనంతపురం డిపోలో మిగిలిన మంచి కండిషన్‌లో ఉన్న డీజిల్ బస్సులను, అత్యవసరం ఉన్న ఇతర డిపోలకు సర్దుబాటు చేస్తారు. 'రాబోయే రోజుల్లో ఆర్టీసీలో డీజిల్ బస్సులు ఉండవు. కేవలం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే కొత్తగా వస్తాయి. ప్రస్తుతం అనంతపురం డిపోకు మాత్రమే ఈ-బస్సులు కేటాయించారు. దీనికి సంబంధించిన విధివిధానాలు ఇంకా రావాల్సి ఉంది' అని జిల్లా ప్రజా రవాణా అధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు.

# నడి సముద్రంలో వెనెజువెలా ట్యాంకర్ సీజ్

హెలికాప్టర్ లో వెళ్లి ఆయిల్ షిప్ పై దిగిన అమెరికా సైనికులు

వెనెజువెలా నుంచి క్యూబాకు వెళుతున్న షిప్

కరీబియన్ దీవుల్లో మోహరించిన అమెరికా యుద్ధ నౌకలు



వెనెజువెలా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. పదవి నుంచి దిగిపోవాలని వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మధురోను ఇప్పటికే హెచ్చరించిన ట్రంప్.. ఇటీవల కరీబియన్ సముద్రంలో యుద్ధ నౌకలను మోహరించారు. డ్రగ్ స్మగ్లర్లకు వంత పాడుతున్నారని మధురోపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల పలు డ్రగ్ స్మగ్లింగ్ బోట్లను అమెరికా సైన్యం సముద్రంలోనే పేల్చివేసింది. ఈ క్రమంలో తాజాగా వెనెజువెలా ఆయిల్ ట్యాంకర్ షిప్ ను అమెరికా సైన్యం సీజ్ చేసింది. వెనెజువెలా తీరం నుంచి క్యూబాకు బయలుదేరిన ఈ భారీ షిప్ ను అమెరికా సైనికులు తమ అధీనంలోకి తీసుకున్నారు. హెలికాప్టర్ లో వెళ్లి షిప్ పై దిగిన సైనికులు.. ఆయుధాలతో షిప్ సిబ్బందిని చుట్టుముట్టిన వీడియోను అమెరికా మీడియాకు విడుదల చేసింది. ఈ విషయంపై ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటిలో ఇదే అతిపెద్ద ఆయిల్ ట్యాంకర్ అని చెప్పారు. ఇకముందు కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతాయి, మీరు చూస్తారంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రతిపక్ష నేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మరియా కొరినా మచాడోపై ఆ దేశ అధ్యక్షుడు మధురో విధించిన ఆంక్షలను మీడియా ట్రంప్ వద్ద ప్రస్తావించింది. ఈ నెల 10న నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ బహుమతి ప్రదానోత్సవానికి మచాడో హాజరైతే ఆమెను అరెస్టు చేస్తామని మధురో హెచ్చరించారు. దీంతో ఆమె బహుమతి ప్రదానోత్సవానికి హాజరు కాలేదు. మచాడో తరపున ఆమె కూతురు నోబెల్ బహుమతి అందుకున్నారు. అయితే, మచాడో నార్వేకు వెళ్లారని సమాచారం. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. మచాడో అరెస్టవుతారని తాను భావించడం లేదని, ఆమె అరెస్టు కావడం తనకు నచ్చదని వ్యాఖ్యానించారు.

# ఈ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్‌లో అదరగొడతారు

ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతున్న కస్తూర్బా పాఠశాల విద్యార్థులు

బాలలకు ఆంగ్లభాషలో మెళకువలపై తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయుని బుర్రలత

100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపు




గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు బడులపై ఆసక్తికి ఆంగ్ల మాధ్యమం చదువులూ ఓ ముఖ్య కారణమే కారణమే. అందుకే, వాటికి దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు ఇంగ్లిష్ వచ్చేలా చేయాలనుకున్నారు ఉపాధ్యాయురాలు సీఆర్టీ బుర్రలత. పెద్దపల్లి జిల్లా అంతర్గాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడేవిధంగా చేయగలిగారు. తాను అనుకున్న లక్ష్యాన్ని ఏవిధంగా సాధించారు అనేదానిపై బుర్రలత మనోగతం ఆమె మాటల్లోనే."ఈ పోటీ ప్రపంచంలో ముందుండాలంటే మాతృభాషపై మమకారంతోపాటు ఇంగ్లిష్ భాషపై పట్టు తప్పనిసరి. 2018లో నేనీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరినప్పుడు విద్యార్థినులు ఆంగ్ల భాషలో మాట్లాడేందుకు విద్యార్థులు సిగ్గు పడేవారు. భయంతో కాస్త వెనుకంజ వేసేవారు. ఈ విషయాన్ని గమనించి వాళ్లకి ఆంగ్లం ప్రాముఖ్యతను, భాషపై ఆసక్తిని కల్పించేందుకు వినూత్నంగా ఆలోచించాను. ఇందుకోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్, పర్సనల్ డిక్షనరీలు, లఘు చిత్రాలు, తదితర అంశాలను సిద్ధం చేసి వాటిని ఒక్కొక్కటిగా అమలు చేశా. దీంతో విద్యార్థినులకు ఆంగ్ల భాషపై మరింత ఆసక్తి పెరిగి చదవడం, మాట్లాడటం, రాయడంలో (ఎల్ఎస్ఆర్‌డబ్ల్యూ స్కిల్స్) విజయవంతమయ్యారు. అంతేకాదు, మారుమూల ప్రాంతంలోని మా కేజీబీవీ విద్యార్థినులకు ఏకంగా రాష్ట్రపతికి రాఖీ కట్టే అవకాశం వచ్చిందంటే ఆంగ్లభాషపై పట్టు సాధించడమే కారణమనుకుంటున్నా. ఇది నా జీవితంలోనే అతి పెద్ద అవకాశం. మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రాంతం. మా నాన్న సింగరేణి కార్మికుడిగా పనిచేసేవారు. అక్కడే పదోతరగతి వరకూ చదువుకున్నాను. ఇంటర్ హైదరాబాద్‌లో, డిగ్రీ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి పూర్తి చేశాను. పెద్దపల్లిలో బీఈడీ అయ్యాక ఎంఏ ఇంగ్లిష్ సబ్జెక్టులో బంగారు పతకం సాధించా. ఆంగ్లం అంటే విద్యార్థినులకు భయం పోగొట్టేందుకు గాను సరికొత్త బోధనా పద్ధతులద్వారా వారికి చేరువయ్యాను. ఈ కృషి గాను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నో అవార్డులూ, రివార్డులూ, సత్కారాలు అందుకున్నా. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ(స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్) ప్రశంసాపత్రాన్నీ అందించింది. అదెలాగంటేవినడం, మాట్లాడటం, చదవడం, రాయడం లాంటి స్కిల్స్‌పై 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసి రోజుకో టాపిక్‌ను విద్యార్థులకు ఇచ్చాను. స్వాతంత్ర్య సమరయోధులు, వ్యక్తిత్వ నిపుణులు, ఇతర అంశాలపై రోజుకో విద్యార్థిని 'జస్ట్ ఎ మినిట్' తరహాలో విద్యార్థులతో మాట్లాడటం, పాఠ్యాంశాలను స్కిట్లుగా, స్పీకింగ్ స్కిల్స్, రాత నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ నేర్పించాను. ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌లో రాణించాలంటే ఒకాబులరి ముఖ్యం. తరగతిలోని ప్రతి పాఠంలోని అర్థాలు, నానార్థాలు, వ్యతిరేక పదాలతో ప్రతిఒక్కరూ సెల్ఫ్ డిక్షనరీని తయారుచేసుకున్నారు. విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోగొట్టేందుకు ప్రార్థన సమయంలో ఏదో ఒక అంశంపై విద్యార్థునులు మాట్లాడాలన్న రూల్ పెట్టా. అంతేకాదు, ఆంగ్ల భాషలో మరింత అభివృద్ధిని సాధించేందుకు 'ఇన్‌స్పైర్-ఎడ్యుకేట్-ఎంపవర్' అనే లఘు చిత్రాన్నీ(షార్ట్ ఫిల్మ్) రూపొందించాం. ఎల్టా(ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్)తో పాటు మరెన్నో సంస్థలు నిర్వహించిన పలు పోటీల్లో మా విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి పలు బహుమతులు అందుకున్నారు. ఇవి పాఠశాల గౌరవాన్ని మరింత ఇనుమడింప చేశాయి. ఏ గురువుకైనా ఇంతకు మించిన సంతృప్తి ఏముంటుంది"హ

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com